www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 27 ఏప్రిల్ 2025

5

తిరుపతి



గంగజాతర పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తాతయ్యగుంట గంగ జాతర వాల్ పోస్టర్‌ను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు శనివారం ఆవిష్కరించారు. మే 6 నుండి 13వరకు జాతర జరుగుతుందన్నారు. 14 తెల్లవారుజామున అమ్మవారి విశ్వరూప దర్శనంతో ముగుస్తుందన్నారు. మే 10వ తేది అమ్మవారికి శేషవస్త్రాలు సమర్పించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ రుద్రకోటి సదాశివం, ఈఓ జయకుమార్, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, మబ్బు దేవనారాయణ రెడ్డి, బిజేపి నాయకులు అజయ్, జనసేన నాయకులు రాజారెడ్డి, పులుగోరు మురళీ, బుల్లెట్ రమణ, శ్రీధర్ వర్మ, ఆముదాల తులసి, పుష్పావతి తదితరులు పాల్గొన్నారు.

రఘురామకృష్ణమరాజు బహిరంగ క్షమాపణ చెప్పాలి

- ఉపసభాపతి స్థానానికే అనర్హుడు: వందవాసి నాగరాజు
- దేశవ్యాప్త గుర్తింపు ఉన్న వ్యక్తి వి.శ్రీనివాసరావు : కందారపు మురళి

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం, సిపిఐ నాయకులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉండి దేశవ్యాప్తంగా గుర్తింపు కలిగిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావును ఉప సభాపతి, ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణమరాజు నోటికొచ్చినట్లు మాట్లాడటం మంచి పద్ధతి కాదని, వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని సిపిఎం, సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. ఉండిలో పేదల ఇళ్ల కూల్చివేతపై అక్కడివారికి అండగా నిలబడ్డ శ్రీనివాసరావుపై ఉపసభాపతి రఘురామకృష్ణమరాజు చేసిన అనుచిత వ్యాఖ్యలుపై వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ తిరుపతి జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ ఉన్నత స్థానంలో ఉన్న వ్యక్తి హుందాగా మాట్లాడాలని, ఆయన నియోజకవర్గంలో గూడు లేని పేదల ఇళ్ళను కూల్చివేతపై స్థానిక ఎమ్మెల్యేగా ఆయన స్పందించాలి గాని, పేదలకు అండగా నిలబడ్డ వారిని దూషణలకు దిగడం సబబు కాదన్నారు. గతంలో రఘురామకృష్ణంరాజుపై పోలీసులు దాడి చేశారని దేశవ్యాప్తంగా చెప్పుకుంటూ తిరిగిన వ్యక్తి, నేడు పేదల పక్షాన నిలబడే కమ్యూనిస్టు పార్టీ నాయకుడిని దుర్భాషలాడుతూ గోదావరి జిల్లా వాసుల పరువు తీశారన్నారు. ఈయన ఎన్నో స్కాములు చేశాడని, బ్యాంకులో లోన్లు ఎగొట్టడం, డొల్ల కంపెనీలు ప్రారంభించి మూసివేయడం ఇవన్నీ కూడా ప్రజల్లోకి తీసుకెళ్తామని హెచ్చరించారు. ఉపసభాపతి హోదా మరచి మాట్లాడిన వ్యాఖ్యలపై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌లు స్పందించి ఆయనను ఆ స్థానం నుండి తప్పించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందారపు మురళి మాట్లాడుతూ యావత్తు భారతదేశంలో గుర్తింపు కలిగిన వ్యక్తి, దేశంలోని మేధావులలో ఒకరైన వి.శ్రీనివాసరావును ఏకవచనంతో దూషించడం కమ్యూనిస్టు పార్టీలుగా తీవ్రంగా పరిగణిస్తున్నామన్నారు. రఘురామ కృష్ణంరాజు నోరు తెరిస్తే బూతులేనని, ఆయన బండారాన్ని త్వరలోనే బయటపెడతామన్నారు. ఇలాంటి వ్యక్తిని కూటమి ప్రభుత్వంలో ఉంచుకోవడం సహేతుకం కాదని కూటమి ప్రభుత్వ పెద్దలకు సూచిస్తున్నామన్నారు. పేదల పక్షాన కమ్యూనిస్టులుగా ఎన్ని మాటలు అయినా భరిస్తాం కానీ, పేదల పక్షం మాత్రం ఎప్పటికీ విడవమన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి మురళి మాట్లాడుతూ భూములు పంచిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీలదని, అలాంటి కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర నాయకుడిని హద్దు మీరి మాట్లాడడం మంచి పద్ధతి కాదన్నారు. కమ్యూనిస్టులను విమర్శించిన వారు ఏమైపోయారో, ఎలాంటి ఫలితాలు అనుభవిస్తున్నారో నేడు అందరికీ తెలుసన్నారు. రఘురామ కృష్ణంరాజు కమ్యూనిస్టులకు బహిరంగ క్షమాపణ చెప్పకపోతే కార్యచరణతో ఉద్యమిస్తామన్నారు. రిపబ్లిక్ ఆన్ పార్టీ ఆఫ్ ఇండియా దక్షిణాది రాష్ట్రాల అధ్యక్షులు అంజయ్య మాట్లాడుతూ రఘురామ కృష్ణంరాజు ఇంకా రాజుల రాచరికపు వ్యవస్థను మరిచిపోలేదన్నారు. ఎవరైనా ఎంతటి ప్రజా ప్రతినిధి అయిన చట్టానికి లోబడే పనిచేయాల్సి ఉంటుందని, ఈ విషయాన్ని ఆయన గుర్తుంచుకోవాలని సూచించారు. ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా నేత నీరుగట్టు నగేష్ మాట్లాడుతూ సభ మర్యాదలను కాపాడాల్సిన వ్యక్తి బహిరంగంగా సవాళ్ల విసరడం ఏమిటని ప్రశ్నించారు. ఎన్నికల అఫిడవిట్‌లో రఘురామ కృష్ణంరాజు చేసిన మోసాలను కప్పిపుచ్చారన్నారు. కమ్యూనిస్టు పార్టీ సిపిఎంకు ప్రతి పేదవాడు అండగా ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతారి రాధాకృష్ణ పాల్గొన్నారు.

ఏనుగు దాడిలో రైతు మృతి

ప్రజాశక్తి - చిన్నగొట్టిగల్లు: స్థానిక చిట్టేచర్ల పంచాయతీలో శుక్రవారం రాత్రి ఏనుగుల గుంపు రైతు సిద్దయ్యను(65) తొక్కి చంపేసింది. మృతుడు తన మిరప తోట దగ్గర రాత్రి 8 గంటల వరకు ఉన్నాడు. తరువాత ఇంటికి బయలుదేరే క్రమంలో ఏనుగును గమనించని సిద్దయ్య వాటికి దగ్గరగా వెళ్లడంతో ఏనుగు రైతును తొక్కి చంపేసింది. నిన్న ఉదయం స్థానిక బోగ్గలవారి వారిపల్లెలో పట్టపగలే ఏనుగు ఉండటం గమనించి, రైతులు కేకలు వేయడంతో అక్కడనుండి తరలిపోయి, అదే రోజు రాత్రి చిట్టేచర్ల పంచాయతీ, దాసరగూడెం రైతు సిద్దయ్య పొలంలో తటస్థపడడం చూస్తుంటే ఫారెస్ట్ సిబ్బంది అప్రమత్తంగా లేరనేది గమనార్హం. పంటలు నాశనమవడమే కాకుండా ప్రాణాలు పోతుండడంతో రైతులు భయభ్రాంతులకు గురవుతున్నారు. గత కొన్ని ఏళ్లుగా ఏనుగుల గుంపు చుట్టుపక్కల మండలాల్లో సంచరిస్తూ అనేకమంది రైతులను బలి కొనడంతో స్థానిక రైతులు ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తున్నారు. నాయకుల హడావిడి, అధికారుల కంటి తుడుపు చర్యలు తప్ప ఇంతవరకు శాశ్వత పరిష్కారం దొరక్క పోవడం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. ఇకనైనా ఫారెస్ట్, రెవెన్యూ సిబ్బంది తగు చర్యలు తీసుకుని శాశ్వతంగా ఏనుగుల బారి నుండి పంట పొలాలతో పాటు తమకు రక్షణ కల్పించాలని రైతులు కోరుతున్నారు.

మృతి చెందిన రైతు కుటుంబానికి నష్టపరిహారం 10 లక్షలు చెల్లించాలి : ఏపీ రైతు సంఘం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: చిన్నగొట్టిగల్లు మండలం, చిట్టేచర్ల పంచాయతీ, కొత్తపల్లి సమీపంలో దాసరగూడెంకు చెందిన సిద్దయ్య (65)ను ఏనుగు తొక్కి చంపేయడంతో ఆ కుటుంబం వీధిన పడింది. ఆ కుటుంబాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని రైతు సంఘం జిల్లా కార్యదర్శి హేమలత అన్నారు. ఇప్పటికే చంద్రగిరి మండలం, పులిచర్ల మండలం, ఇప్పుడు చిన్నగొట్టిగల్లు మండలాల్లో ముగ్గురు రైతులు చనిపోయారన్నారు. ఏనుగుల వలన పంట నష్టపోవడమే కాకుండా, రైతులు ప్రాణాల అరచేతిలో పెట్టుకుని బ్రతుకుతున్న పరిస్థితి నెలకొందన్నారు. ఒంటరి ఏనుగుల్ని గ్రామాల్లోకి రాకుండా కాపాడుతామని చెప్పిన ఉప ముఖ్యమంత్రి ఈరోజు సమాధానం చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. ఏనుగుల్ని పంటలోకి రాకుండా చూసుకోవలసిన బాధ్యత అటవీశాఖ, ప్రభుత్వాలదేనని, వీటి వల్ల రైతులెందుకు నష్టపోవాలని , నష్టపరిహాల పరిహారాల కోసం రైతుల ఎదురు చూడాల్సిన అగత్యం ఏమిటని దుయ్యబెట్టారు. వెంటనే ఆటవీ ప్రాంతమంతా సోలార్ ఫెన్సింగ్ వేసి రైతులను ఆదుకోవాలన్నారు. లేకపోతే భవిష్యత్తులో రైతులతో పోరాటం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.

అపోలోలో అడ్వాన్స్ టెక్నాలజీతో గుండె వైద్యం

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అపోలో ఆసుపత్రి డాక్టర్ విజయ్ చంద్రారెడ్డి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: అడ్వాన్స్ టెక్నాలజీతో అపోలో ఆసుపత్రిలో అన్ని రకాల గుండె వైద్య సేవలు అందిస్తూ, ఇంటర్నేషనల్ కార్డియాలజీ రంగంలో హార్ట్ వేర్ ఉపయోగించిన టెక్నిక్‌లలో అద్భుతమైన పురోగతిని సాధించడమే కాక దీర్ఘకాలిక సక్సెస్ రేట్‌ను అందించగలుగుతున్నామని చెన్నై అపోలో హాస్పిటల్స్ ప్రముఖ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ విజయచంద్రారెడ్డి తెలిపారు. శనివారం తిరుపతిలోని ఓ ప్రముఖ హోటల్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హృదయం ఆనేది నిరంతరంగా పనిచేసే కండరాల పంపు,అది అనుక్షణం పనిచేస్తూ జీవితాన్ని నిలబెడుతుందన్నారు. అటువంటి గుండెను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని సూచించారు. అతి తక్కువ ఖర్చుతో అడ్వాన్స్ టెక్నాలజీని ప్రజలకు అందించేందుకు తామెప్పుడు ముందుంటామని డాక్టర్ విజయ చంద్రారెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అపోలో హాస్పిటల్ సీనియర్ జనరల్ మేనేజర్ డాక్టర్ నాగార్జున రెడ్డి,వైద్యులు,వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ చట్ట సవరణ బిల్లు రద్దు చేయాలి

ప్రజాశక్తి - కోట : మతోన్మాద ఎజెండా అమలులో భాగంగా బిజెపి ప్రభుత్వం ముస్లింలపై విద్వేషాన్ని చిమ్ముతూ అనేక దాడులు చేస్తుందని సీఐటీయు జిల్లా కమిటీ సభ్యులు పి.శ్రీనివాసులు విమర్శించారు. ఈ సందర్భంగా శనివారం కోట మండలంలోని వక్ఫ్ చట్ట సవరణ బిల్లు అమలుకు పార్లమెంట్లో ఆమోదం పొందిన దాన్ని వ్యతిరేకిస్తూ స్థానిక జామియా మసీద్‌లో శనివారం ముస్లిములకు కరపత్రాలు పంపిణీ చేశారు. వక్ఫ్ చట్ట సవరణ బిల్లుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐటీయు జిల్లా కమిటీ సభ్యులు పి.శ్రీనివాసులు మాట్లాడుతూ బిజెపి అధికారం చేపట్టినప్పటి నుంచి లవ్ జిహాద్, ఘర్‌వాపసీ, కామన్ సివిల్ కోడ్, మసీదుల విధ్వంసం, మూక హత్యలతో మతోన్మాద శక్తులు తలపడుతున్నాయని, ఇప్పుడు సరికొత్తగా వక్ఫ్ సవరణ చట్టం ద్వారా ముస్లింలు ధార్మిక, సామాజిక, సాంస్కృతిక సంస్థలపై దాడి తలపెట్టిందని విమర్శించారు. ఈ చట్టంతో ఆస్తులు కబ్జా చేయడానికి తప్ప, వక్ఫ్ ఆస్తులు అభివృద్ధికి కాదన్నారు. వక్ఫ్ సవరణ బిల్లు అమలుకు పార్లమెంట్లో ఆమోదం పొందిన దాన్ని వ్యతిరేకిస్తూ సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో కోట మసీదుల్లో, పలు దుకాణాల్లో కరపత్రాలను పంపిణీ చేసి నాయకులు ప్రచారం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ నాయకులు ముత్యాలయ్య, ఎమ్.రమణయ్య, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

ఉత్తమ నమూనాగా శ్రీసిటీకి ప్రశంస

ప్రజాశక్తి - వరదయ్యపాలెం: సెజ్ పాలసీ లక్ష్యాలకు ధీటుగా అభివృద్ధి చెందిన శ్రీసిటీ పారిశ్రామికవాడ దేశానికి ఉత్తమ నమూనాగా కేంద్ర వాణిజ్య శాఖ మాజీ కార్యదర్శి జి.కె.పిళ్లై అభివర్ణించారు. దేశంలో సెజ్‌ల రూపకల్పనలో కీలక భూమిక పోషించిన పలువురు మాజీ కేంద్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు శ్రీసిటీని సందర్శించారు. జి.కె.పిళ్లై ఆధ్వర్యంలో విచ్చేసిన వీరికి శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి స్వాగతం పలికారు. శ్రీసిటీ స్థాపన నుంచి ఇప్పటివరకు సాధించిన అభివృద్ధి, విజయాలు, ఇతర పలు ప్రత్యేకతలను వారికి వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ, సెజ్ పాలసీ మార్గదర్శకులు శ్రీసిటీ పర్యటనకు రావడం తనకు ఆనందంగా, గర్వంగా ఉందని వ్యాఖ్యానించారు. అనంతరం సందర్శకులు స్థానిక ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌కు వెళ్లి, అక్కడ విద్యార్థులు, అధ్యాపకులతో సంభాషించారు. అక్కడ విద్యా విధానం, పరిశ్రమతో అనుబంధం తదితర అంశాలపై ఆరా తీసి, తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

నీటి ఎద్దడి లేకుండా చూడండి : కలెక్టర్ వెంకటేశ్వర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: జిల్లాలో నీటి ఎద్దడి లేకుండా చూడాలని, సమస్య ఉన్న చోట నీటి ట్యాంకర్లను అందుబాటులో ఉంచుకోవాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో తాగునీరు, సాలిడ్ వేస్ట్ లిక్విడ్ మేనేజ్మెంట్ పై మున్సిపల్ కమిషనర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఉష్ణోగ్రతలు తీవ్రతగా ఉన్నాయని, ఎక్కడ కూడా నీటి సమస్య లేకుండా చూడాలని సూచించారు. నీటి సమస్య ఉన్న ప్రదేశాలలో టాంకర్ల ద్వారా సరఫరా చేయాలన్నారు. ఘన పదార్థాల సేకరణ తర్వాత, శుద్ధి చేయడం ప్రధాన అంశమన్నారు. జిల్లాలో ఎక్కడ కూడా డంపింగ్ అనేది ఉండరాదన్నారు. ఈ వ్యర్థాల డంపింగ్‌కు సంబంధించిన స్థల కేటాయింపుపై తహశీల్దారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. మున్సిపల్ అధికారులు వ్యర్థాల నిర్వహణలో ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. పబ్లిక్ ప్రదేశాలలో తప్పకుండా చలివేంద్రాలు ఉండేలా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గూడూరు, సూళ్లూరుపేట, నాయుడుపేట, వెంకటగిరి, శ్రీ కాళహస్తి, మున్సిపల్ కమిషనర్‌లు వెంకటేశ్వర్లు, చిన్నయ్య, పజుల్లా, వెంకట్రామిరెడ్డి, గిరి కుమార్, ఈఈ పబ్లిక్ హెల్త్ సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

నీట్ సూపర్ స్పెషాలిటీ ప్రవేశ పరీక్షలో గూడూరు వాసి ప్రతిభ

డాక్టర్ పర్వత కీర్తి కుమార్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, కర్నాలవీధి ప్రాంతానికి చెందిన డాక్టర్ పర్వత కీర్తి కుమార్ దేశ వ్యాప్తంగా సూపర్ స్పెషాలిటీ ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ ప్రవేశ పరీక్షలో సత్తా చాటారు. శుక్రవారం విడుదల చేసిన ఫలితాల్లో జాతీయ స్థాయిలో 132వ ర్యాంకు సాధించారు. ప్రస్తుతం కీర్తి కుమార్ గూడూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. దీనితో ఆయన తల్లిదండ్రులు, బంధుమిత్రులు శుభాకాంక్షలు తెలిపారు.

స్మార్ట్ మీటర్లు వద్దు - కరెంటు చార్జీలు తగ్గించాలి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరులో సి.పి.ఎం పార్టీ ఆధ్వర్యంలో 'మా ఇంటికి స్మార్ట్ మీటర్లు వద్దుకరెంటు చార్జీలు తగ్గించాలి' అనే నినాదాలతో కూడిన స్టిక్కర్లను పట్టణంలోని పురవీధులలో ప్రధాన కూడళ్లలో ఆటోలకు ఇతర వాహనాలకు శనివారం అంటించారు. ఈ సందర్భంగా సిసిఎం నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు స్మార్ట్ మీటర్లు వ్యవసాయ పంపుసెట్లు గాని, గృహాలు గాని బిగించినట్లయితే పగలగొట్టమని చెప్పిన నాయకులే ఇప్పుడు బిగించాలనడం ఏమిటని ప్రశ్నించారు. కరెంటు చార్జీలు వేసవిని దృష్టిలో ఉంచుకొని పెంచడం సబబు కాదని, తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గూడూరు సి.పి.ఎం పార్టీ ప్రాంతీయ కార్యదర్శి జోగి. శివకుమార్, గూడూరు పట్టణ సి.ఐ.టి.యు నాయకులు బి.వి రమణయ్య, ఆటో సంఘం నాయకులు ఎస్.చైతన్య,ఎస్.కె. మున్నా,రఫీ,జమీర్, మురుగ, బి చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

'ట్రంపు దూకుడు- భారత్‌పై ప్రభావం'

అంశంపై నేడు సదస్సును జయప్రదం చేయండి !

➤ సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు పిలుపు !!

పుస్తకం ఆవిష్కరిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వి నాగరాజు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్, తిరుపతి సిటీ: మే నెలలో 8 నుండి 10వ తేదీ వరకు తిరుపతిలో జరుగుతున్న రాష్ట్ర కమిటీ సమావేశాల సందర్భంగా ఈ రోజు 10 గంటలకు యశోద నగర్, వేమన విజ్ఞాన కేంద్రంలో "ట్రంపు దూకుడు- భారత్ పై ప్రభావం" అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నట్లు శనివారం యశోద నగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో జరిగిన విలేకరుల సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు తెలిపారు. ఈ సదస్సులో సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా పాల్గొంటారని తెలిపారు. రెండవసారి ట్రంపు అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత ఆ దేశంలో ట్రంప్ విధానాలకు వ్యతిరేకంగా దాదాపు 6 లక్షల మంది నిరసనలు చేపట్టారని గుర్తు చేశారు. అమెరికా ఆర్థిక లోటును పూడ్చుకోవడానికి దాదాపు 75 దేశాలపై సుంకాలను భారీగా ట్రంప్ పెంచాడని, ఈ ప్రభావం భారత్‌పై కూడా ఉంటుందని అన్నారు. ట్రంప్ విధానాలపై మోడీ కనీసం స్పందించకోవడం అన్యాయమన్నారు. రేపు జరిగే సదస్సుకు పార్టీ శ్రేణులు, ప్రజా సంఘాల నాయకులు, మేధావులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి కె వేణుగోపాల్, నగర నాయకులు టి సుబ్రమణ్యం, పి. బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో వేసవి రద్దీ

అలిపిరి వద్ద బారులు తీరిన వాహనాలు

ప్రజాశక్తి - తిరుమల: తిరుమలలో వేసవి రద్దీ పెరుగుతోంది. అలిపిరి చెక్‌పాయింట్ లో శనివారం వాహనాలతో కిక్కిరిసిపోయింది. తిరుమలలో భక్తుల రద్దీ పెరుగుతున్న ప్పటికీ అలిపిరి తనిఖీ కేంద్రం మాత్రం వాహనాలతో రద్దీగా మారిపోయింది. సొంతవాహనాల్లో తిరుమలకు వచ్చేవారి సంఖ్య పెరిగిపోవడంతో పాటు ఇటీవల చోటుచేసుకున్న కొన్ని పరిణామాలతో పటిష్టమైన భద్రతా తనిఖీలు చేపడుతున్నారు. ఈక్రమంలో అలిపిరి కేంద్రం ముందు ఉదయం నుంచి సాయంత్రం వరకు వాహనాలు క్యూకట్టాయి. గరుడ సర్కిల్ వరకు వాహనాలు నిలిచిపోవడంతో ఆ ప్రాంతమంతా రద్దీగా మారిపోయింది. శ్రీవారి దర్శనం కోసం భక్తులకు దాదాపు 12 గంటల సమయం పడుతుంది.

శాంతి ర్యాలీలు సరే.. భద్రతకు భరోసా ఏది..?

ప్రజాశక్తి-తిరుపతి సిటీ :

పెహల్గామ్‌లో ఉగ్రదాడిని ఖండిస్తూ, నాలుగు రోజులుగా జిల్లా వ్యాప్తంగా శాంతి ర్యాలీలు నిర్వహిస్తున్నారు. ఉగ్రవాదుల ఉన్మాదాన్ని ఖండిస్తూ ఐక్యరాగం పాడుతున్నారు. యావత్తు దేశం ప్రభుత్వాన్ని అండగా ఉండాలని పిలుపునిస్తున్నారు. ఇలాంటి తరుణంలో ఈ చర్యలు అవసరమే. కానీ దానికంటే ముందు ప్రపంచ ప్రసిద్ధిగాంచిన అధ్యాత్మిక క్షేత్రం తిరుమల భద్రతకు తీసుకుంటున్న ప్రత్యేక చర్యలు ఏంటంటూ సామాన్యులు, భక్తులు ప్రశ్నిస్తుండడం గమనార్హం.

ప్రజాదృష్టి

భారతదేశంలో లౌకికవాదంతో కూడిన రాజ్యాంగం అమలు జరుగుతోంది. ఇక్కడ అన్ని మతాల, కులాల, ప్రాంతాల ప్రజలు జీవనం సాగిస్తున్నారు. దేశాభివృద్ధి కోసం ప్రతి ఒక్కరు ఇతోధిక కృషి చేస్తూనేఉన్నారు. బారత్‌కు దాయాది దేశమైన పాకిస్తాన్ ఉగ్రవాదాన్ని పోషిస్తుందన్నది నిత్యం పాలకులు వల్లెవేసే కథే. పాకిస్తాన్ మత తత్వ దేశమని, ఒక మతానికి వత్తాసు పలుకుతూ ఇతర మతాలపై శాడిజాన్ని ప్రదర్శిస్తుందని విమర్శ. కానీ మన పాలకులు చేస్తున్నది ఏమిటి..? మతతత్వ దేశంలో వారి మతాన్ని గొప్పగా చూడడాన్ని తప్పుపడుతున్న నేటి మన పాలకులు ఈ దేశంలో హిందుయేతర మతాలపై చూపుతున్న సవితి ప్రేమ ఏ పాటిదో అందరికి తెలిసిందే. సాక్షాత్తు పాలకులే హిందు మతాన్ని మాత్రమే నమ్మాలని, ఇతర మతాలు ఇక్కడ ఉండరాదనేలా వ్యవహరిస్తున్నాయి. హిందూయేతరులపై యుపి, మణిపూర్‌లో జరుగుతున్న దారుణాలు గమనిస్తూనే ఉన్నాం. మతాలను రెచ్చగొట్టి, విధ్వంసాలకు కారణమవుతున్న వారిని ఏమంటారో బూర్జువా రాజకీయ పార్టీలు ప్రజలకు సమాధానం చెప్పాలి.

ఈ నెల 22వ తేదిన జమ్ముకాశ్మీర్ సమీపంలోని పెహల్గామ్‌లో విహార యాత్రకని వెళ్లిన సందర్శకులపై ఐదు మంది ఉగ్రవాదులు దాడి చేసి, మగవారిని, ఆడవారిని వేరు చేసి, అందులో హిందువులనే టార్గెట్‌గా పెట్టుకుని చంపడం శోచనీయం. ఇలాంటి దారుణాన్ని యావత్ భారత దేశమే కాదు, ప్రపంచ దేశాలు సైతం ఖండించాయి. కేంద్రం హుటా హుటిన ప్రధాని అధ్యక్షతన సమావేశమై దాయాదు దేశం పాకిస్తాన్‌పై కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకునింది. ఒక దశలో యుద్ధానికి సిద్ధం అనే సంకేతాలను అందిస్తోంది. పాకిస్తాన్ తీరును నిరసిస్తూ జిల్లా వ్యాప్తంగా పలు రాజకీయ పార్టీలు, ప్రజా, మహిళ, వ్యాపార విద్యార్థి సంఘాలు, కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి సంఘీభావాన్ని తెలుపుతున్నారు. రాజకీయాలకు, పార్టీలకు అతీతంగా ఐక్యంగా చేయాల్సిన ఇలాంటి ర్యాలీలు సైతం విడివిడిగా చేపడుతుండడం శోచనీయం. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి పార్టీలు సైతం ఒక్కో పార్టీ.. ఒక్కో రోజు.. ఒక్కో ప్రాంతంలో విడివిడిగా, వేరుగా క్యాండిల్ ర్యాలీ నిర్వహించి తమ మద్య ఏ పాటి ఐక్యత ఉందో వెల్లడించారు. బూర్జువా రాజకీయ పార్టీలు తమ స్వభావాన్ని మరోసారి నిరూపించేలా వ్యవహరించడం గమనార్హం. ఇలాంటి తరుణంలో ప్రపంచ ప్రసిద్ధిగాంచిన తిరుమల భద్రతపై సామాన్యులు, భక్తులు కొంత అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మతాల చాటున, ఒక మతానికి వత్తాసు పలుకుతూ నిర్ణయాలు తీసుకుంటున్న టిటిడి యాజమాన్యం అన్ని మతాలకు చెందిన భక్తులకు సక్రమంగా, ఒకే విధంగా భద్రత కల్పిస్తుందా అన్నది ప్రశ్న. లడ్డు నెయ్యి కల్తీ, గోవుల మృతి వంటి వివాదస్పద

విమర్శలకు ప్రాధాన్యత ఇస్తున్న పాలకమండలి, అధికారులు, తిరుమల నిఘా భద్రతలో నిర్లక్ష్యత ప్రదర్శిస్తు న్నారనే విమర్శలు ఉన్నాయి. అందుకు తగ్గట్టు టిటిడి ఆలయం ఎదుట మందుబాబు వీరంగం, క్యూలైన్లో చెప్పులతో భక్తులు మహద్వారం వరకు ప్రవేశించడం, తిరుమలో గంజాయి విక్రయాలు జరుగుతుండడం వంటి ఘటనలు కొన్ని నిదర్శనంగా నిలుస్తున్నాయి. పెహల్గామ్ ఉగ్రదాడి తర్వాత భద్రత కట్టుదిట్టం చేశామని, మాక్‌డ్రిల్ నిర్వహణకు మాత్రమే పరిమితమైన టిటిడి ఇలాంటి పరిస్థితుల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏమాత్రం భద్రత ఇస్తుందో వేచి చూడాలి. టిటిడి వద్ద మంచి నిఘా, భద్రత సిస్టమ్, అందుకు తగ్గ వ్యవస్థ ఉంది. వాటిని సక్రమంగా వినియోగించి, పూర్తి స్థాయిలో భక్తులకు మెరుగైన భద్రత ఇస్తుందని ఆశిద్దాం.

కాళ్లు పట్టినా.. కరగని కర్కశత్వం

- దళిత మహిళపై ఏపీఐఐసి అధికారి జులుం
- జీవనాధారమైన దుకాణం కూల్చివేత
- కూటమి నేతే సూత్రధారి : బాధిత మహిళ

అసలే అధికారం.. ఆపై నేతల దన్ను. ఇంకేం.. కావాలి చెలరేగిపోవడానికి, కుటుంబ పోషణకు చిన్న అంగడి నడుపుకుంటున్న దళిత మహిళపై ఏపీఐఐసి అధికారి జులుం.. కాళ్లు పట్టుకున్నా కరగని వైనం.. స్వామి భక్తి చాటుకున్న అధికారి. కూటమి నేత కక్ష సాధింపేనని బాధితురాలి ఆవేదన..

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి:

తన సొంత కాళ్లపై నిలబడాలన్న దృఢ సంకల్పంతో ఓ పరిశ్రమ వద్ద చిన్నపాటి దుకాణం ఏర్పాటు చేసుకున్న దళిత మహిళపై ఏపీఐఐసీ అధికారులు జులుం ప్రదర్శించారు. మహిళ అన్న కనీస మానవత్వం కూడా లేకుండా అనుచితంగా ప్రవర్తించడమే కాకుండా దుకాణాన్ని కూల్చివేసి పొట్ట కొట్టారు. సారూ.. ఈ దుకాణమే నాకు జీవనాధారం... దుకాణం వల్ల ఎవరికి ఎలాంటి ఇబ్బంది లేదు.. కనికరించం డయ్యా అంటున్నా కానీ.. కనికరం లేకుండా ఏపీఐఐసి అధికారులు వ్యవహరించిన ఘటన శనివారం సాయంత్రం తొట్టంబేడు మండలం తాటిపర్తి పంచాయతీ పుని మా మెటెక్స్ పరిశ్రమ వద్ద చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. తాటిపర్తి పంచాయతీకి చెందిన దళితురాలు రేవతి ఆ పంచాయతీ సంఘమిత్రగా పనిచేసేది. అయితే రాజకీయ వేధింపుల్లో భాగంగా కూటమి నేతలు ఆమెను ఉద్యోగం నుంచి తొలగించారు. దీంతో ఉపాధి కోల్పోయిన రేవతి కుటుంబాన్ని పోషించుకునేందుకు సమీపంలోని పునిమా మెటెక్స్ పరిశ్రమ ముందు భాగంలో ఓ చిన్నపాటి చిల్లర కొట్టును ఏర్పాటు చేసుకుంది. తద్వారా వచ్చిన ఆదాయంతో కుటుంబాన్ని పోషించుకుంటుంది. అయితే ఇది కూడా నచ్చని ఓ కూటమినేత దుకాణాన్ని అక్కడ నుంచి తొలగించేయాలంటూ ఏపీఐఐసీ అధికారులను ఉసిగొల్పాడు. దీంతో ఏపీఐఐసి అధికారులు గత రెండు రోజులుగా దుకాణాన్ని తొలగించాలంటూ వేధించడం మొదలుపెట్టారు.

చివరకు ఆ నేత ఒత్తిడితో శనివారం సాయంత్రం ఏపీఐఏసి డీఈ స్థాయి అధికారి నేరుగా దుకాణం వద్దకు వచ్చి కూల్చే ప్రయత్నం చేశాడు. రేవతి ఎంత మొత్తుకుంటున్నా..కాళ్లు పట్టుకున్నా కనికరించకుండా అనుకున్న పని చేసి వెళ్ళాడు. ఆ ప్రయత్నంలో అడ్డుకున్న తనతో ఏపీఐఐసీ అధికారి అనుచితంగా ప్రవర్తించినట్లు రేవతి వాపోయింది. ఏపీఐఐసీ అధికారులకు స్థలంతో సంబంధం లేకుండా కేవలం కూటమినేత ఒత్తిడితోనే దుకాణం కూల్చి తన పొట్ట కొట్టినట్లు రేవతి వాపోయింది. తనకు న్యాయం చేయాలని ప్రాధేయపడింది.

ఏపీఐఐసి అధికారిని వేడుకుంటున్న రేవతి

భూ రీ సర్వే పూర్తి చేయాలి

ప్రజాశక్తి-నూళ్లూరుపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఆంధ్రప్రదేశ్ రీ సర్వే ప్రాజెక్టులో భాగంగా వర్క్ షాప్ కం ఇంటరాక్షన్ మీటింగ్ తిరుపతి జిల్లా, సూళ్లూరుపేట డివిజన్ తహశీల్దార్లు, రీ సర్వే ఉప తహశీల్దార్లు, డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్, సచివాలయ సర్వేయర్లు, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, గ్రామ రెవెన్యూ అధికారులకు అవగాహన, శిక్షణ కార్యక్రమం శనివారం స్థానిక సత్య సాయి కళ్యాణ మండపంలో జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆర్డీవో కిరణ్మయి మాట్లాడుతూ 9 మండలాలలో 60 రోజులలో సర్వే పూర్తి చేయాలని తెలియజేశారు.

ఘనంగా సాయి విద్యానికేతన్ వార్షికోత్సవం



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, డి.ఎన్.ఆర్ కమ్యూనిటీ హాల్‌లో శ్రీ సాయి విద్యానికేతన్ పాఠశాల, ఓజిలి బ్రాంచ్ 9వ వార్షికోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎన్.పి.బి.వి.డి విద్యా సంస్థలు, పొదలకూరు, డైరెక్టర్ నరేంద్ర రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పిల్లలకు దిశా నిర్దేశం చేసే విధంగా ఉపాధ్యాయులు పాఠశాలలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని శివపార్వతి, శ్రీ సాయి విద్యానికేతన్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయిని శ్రావణి, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు దయాకర్, పాఠశాల కార్యనిర్వాహక అధికారి శ్రీనివాసులు, అధ్యాపక బృందం, విద్యార్థిని విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఫల సరుకులు పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో బాలాజీ నగర్‌లోని ప్రగతి నందు కీర్తిశేషులు పొణకా ఆదిశేషారెడ్డి జ్ఞాపకార్థం వారి కుమారుడు పొణకా మల్లికార్జున రెడ్డి సంపూర్ణ సహకారంతో నిరుపేదలైన 15 కుటుంబాలకు18 రకాల పలసరుకులను అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ట్రెజరీ కాటూరి శ్రీనివాసులు, ప్రగతి కుటుంబ సభ్యులు వాకాటి రామ్మోహన్‌రావు, శ్రీ చైతన్య స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, శివకుమార్ రెడ్డి, వాచ్ షాప్ రాము, రిటైర్డ్ ఎస్సై ప్రభాకర్, పీడీ కరిముల్లా, కోట వెంకటేశ్వర్లు, లలితా బ్రాండ్ వెంకటేశ్వర్లు, నారాయణ, గోల్డ్ షాప్ మల్లికార్జున, తూపిలి యశ్వంత్, డిష్ నాగరాజు, కృష్ణా రెడ్డి, విజయ్‌లు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ :విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలి అని పాఠశాల కమిటీ సూచించారు. గూడూరు, సంయుక్త నగర్, శ్రీ సరస్వతీ శిశు మందిరం పాఠశాలలో శనివారం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు, దేశ భక్తి, కళలు, ఆటలపై మక్కువ పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో దువ్వూరు యుగంధర్, పాఠశాల అధ్యక్షులు మల్లెమాల మురళి రెడ్డి, కార్యదర్శి బండి శ్యామ్ సుందర్, ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు విశ్వేశ్వర రావు, ప్రధానాచార్యులు, రంగనాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ గ్రీవెన్స్ సెల్ కార్యదర్శిగా సాయినాయుడు

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: వైసీపీ అధిష్టానం ఆదేశాల మేరకు, రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ కార్యదర్శిగా ఎన్నికైన బియన్ కండ్రిగ వైసీపీ సీనియర్ నాయకులు సాయి నాయుడుని వైస్సార్సీపీ మండల అధ్యక్షుడు కె.మణి నాయుడు, ఆధ్వర్యంలో శనివారం ఉదయం బుచ్చినాయుడు కండ్రిగ వైఎస్ఆర్సిపి కార్యాలయంలో సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సి సెల్ ప్రధాన కార్యదర్శి ఉగ్గముడి గురునాధం, జిల్లా క్రియాశీలక కార్యదర్శి జొన్నల గోపాల్ రెడ్డి, వైస్ ఎంపిపి బాబు రెడ్డి, జయ చంద్ర నాయుడు, అశోక్ నాయుడు, నాగూర్ నాయుడు, మాజీ సర్పంచ్ గురవయ్యలు ఆయనకు శుభాకాంక్షలు తెలియచేశారు.

అధ్యాపకులకు సన్మానం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : స్థానిక ఎస్.కే.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇటీవల పదోన్నతి పొందిన సాయి కృష్ణ, దేవ హర్షలను కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది సన్మానించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే.శివప్రసాద్ మాట్లాడుతూ సాయి కృష్ణ, దేవహర్షలు కళాశాలలో తమ వంతు మెరుగైన సేవలు అందించి ప్రస్తుతం ప్రమోషన్ మీద సీనియర్ సహాయకులుగా సాయి కృష్ణ నాయుడుపేటకు, దేవ హర్ష రాపూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు వెళ్లడం అభినందనీయమన్నారు.ఈ కార్యక్రమంలో ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పి. విజయ మహేష్, ఎన్.సి.సి. ఆఫీసర్ మైమూన్, ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ కన్వీనర్ డాక్టర్ ఝాన్సీ వాణి, రెడ్ రిబ్బన్ క్లబ్ కోఆర్డినేటర్ డాక్టర్ బి. పీర్ కుమార్, శైలజ, కిరణ్మయి, కృపా కరుణ వాణి, భీమవరపు లక్ష్మి, కె. రవి రాజు, హిమబిందు, గోపాల్, జనార్ధన్, సుందరమ్మ, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఉచిత శిక్షణ కార్యక్రమం

ప్రజాశక్తి-తిరుపతి (మంగళం): తిరుపతి పట్టణం, గ్రామీణ ప్రాంతాలలోని నిరుద్యోగ యువతీ యువకులకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడానికి ర్యాంప్ పథకం ద్వారా ఎంటర్ ప్రీన్యూవర్షిప్ కం స్కిల్ డెవలప్మెంట్ పై శిక్షణ కార్యక్రమాన్ని త్రెడ్స్ ఐటి వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా పారిశ్రామిక కేంద్రం జనరల్ మేనేజర్ కెపి సుధాకర్ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతి ఇంటి నుండి ఓ పారిశ్రామికవేత్తను తయారు చేయాలన్న ప్రభుత్వ సంకల్పం మేరకు ఈ శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఉచిత శిక్షణకు హాజరయ్యే వారు 18 నుండి 58 సంవత్సరాలలోపు వయసు కలిగిన వారై, ఆధార్ కార్డు, పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు, కుల ధ్రువీకరణ పత్రం, తెల్ల రేషన్ కార్డు తీసుకుని శిక్షణ తరగతులకు రావాలన్నారు. జిల్లాలోని ఐదు కేంద్రాలలో ఈ ఔత్సాహిక పారిశ్రామికవేత్తల శిక్షణా కార్యక్రమం నిర్వహింపబడుతుందన్నారు. మరిన్ని వివరాలకు 9390786466 ను సంప్రదించాలన్నారు.

మహిళల సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: మహిళల సాధికారత కోసం ఎన్డీఏ కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం సిఎన్‌సి సెంటర్‌లో ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. బిసి కార్పొరేషన్, నగరపాలక సంస్థల ఆధ్వర్యంలో మహిళలకు కుట్టు మిషన్ శిక్షణను ప్రభుత్వం అందిస్తోంది. తొంభై రోజుల పాటు జరిగే ఈ శిక్షణకు 360మంది మహిళలు ఎంపికైయ్యారు. ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమ శాఖ ఈడి శ్రీదేవి, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, నాయిబ్రాహ్మణ ఛైర్మన్ రుద్రకోటి సదాశివం, డిప్యూటీ మేయర్స్ ముద్ర నారాయణ, ఆర్సీ మునికృష్ణ, కార్పొరేటర్ ఎస్ కే బాబు, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, తదితరులు పాల్గొన్నారు.

పోలీసు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

ప్రజాశక్తి -దొరవారిసత్రం: ప్రభుత్వం అమలు చేస్తున్న, అనుసరిస్తున్న పోలీసు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ అజయ్ కుమార్ సూచించారు. ఆయన శుక్రవారం రాత్రి మండల పరిధిలోని కట్టువపల్లి గ్రామంలో ఎస్పీ, డీఎస్పీల ఆదేశాల మేరకు పల్లె నిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఆ గ్రామంలో బస చేసి, గ్రామ ప్రజలతో మమేకమై పోలీసు చట్టాల గురించి క్షుణ్ణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఆ గ్రామ ప్రజలతోపాటు, యువకులు చిన్నారులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనే లక్ష్యం : ఎమ్మెల్యే విజయశ్రీ

ప్రజాశక్తి -దొరవారిసత్రం :నిరుపేదలు ఎదుర్కొంటున్న సమస్యలన్నిటికి సత్వర పరిష్కారం చూపడం జరుగుతుందని ఎమ్మెల్యే విజయశ్రీ భరోసా ఇచ్చారు. దొరవారిసత్రం మండల కేంద్రంలో శనివారం "క్యామెల్ " స్వచ్ఛంద సేవా సంస్థ ఏర్పాటుచేసిన అధికారుల సమన్వయ సమస్యల పరిష్కార సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా 30 గ్రామాల నుండి హాజరైన గిరిజనులు అనేక సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ క్యామెల్ స్వచ్ఛంద సంస్థ సమస్యల పరిష్కారానికి పనిచేస్తోందని తెలిపారు. అన్ని శాఖల అధికారులు గ్రామాల్లోకి వస్తారని సమస్యలు పరిష్కరిస్తారని తెలియజేశారు. క్యామెల్ సంస్థ వ్యవస్థాపకులు గరిక ఈశ్వరయ్య మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టనున్న పి-4 పథకం వివరాలు వివరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ వేమసాని శ్రీనివాసులు నాయుడు, ఎంపీడీవో గోవర్ధన్,క్యామెల్ స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్స్ అంజలి ప్రియదర్శిని, సుహాసిని, 300 మంది గిరిజనులు పాల్గొన్నారు.

గుంతలు, చెరువుల దగ్గరకు వెళ్లొద్దు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : పాఠశాలలకు వేసవి సెలవులు ప్రకటించిన నేపథ్యంలో పిల్లలు సరదాగా ఈత కోసం నీటి గుంతలు, బావులు, కాలువలు, చెరువుల దగ్గరకి వెళ్లొద్దని గూడూరు రూరల్ ఎస్ఐ మనోజ్ కుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా గూడూరు రూరల్ పరిధిలోని గాంధీనగర్ ప్రాంతంలోని నీటి గుంతలు దగ్గర హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రూరల్ ఎస్ఐ మనోజ్ కుమార్ మాట్లాడుతూ గతంలో పిల్లలు ఈతకు వెళ్లి ప్రాణాలను పోగొట్టుకున్నారని, ఇటువంటివి పునరావృతం కాకుండా తల్లి దండ్రులు పిల్లలు పట్ల జాగ్రత్తలు పాటించాలన్నారు.

ప్రభాకర్ రాజు సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పిల్లల పట్ల స్ఫూర్తి చూపించి ఉత్తమ సేవలు అందించిన ప్రభాకర్ రాజు ఎంతో అభినందనీయుడని నగరి నియోజకవర్గ ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ పేర్కొన్నారు. పుత్తూరు డివిజన్ విద్యాశాఖ అధికారి ప్రభాకర్ రాజు పదవి విరమణ కార్యక్రమం పుత్తూరు బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కార్వేటి నగరం డైట్ ప్రిన్సిపాల్ శేఖర్ రెడ్డి, మండల విద్యాశాఖ అధికారులు, టిడిపి నాయకులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్వీయూలో టాపర్లకు ఎండోమెంట్ స్కాలర్‌షిప్‌లు ప్రదానం

ప్రజాశక్తి - క్యాంపస్ : యస్వీయూలో ఆచార్య పి.గోవిందరాజులు, డాక్టర్ పి.ఉషారాణి ప్రారంభించిన ఎండోమెంట్ స్కాలర్‌షిప్ పంపిణీ కార్యక్రమం శనివారం సెనేట్ హాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇంచార్జీ విసి ఆచార్య సిహెచ్. అప్పారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎపి పిజి సెట్-2024లో ఉన్నతమైన ర్యాంక్ సాధించిన విద్యార్థులకు, గణితం, కంప్యూటర్ సైన్స్, అప్లికేషన్స్ విభాగాల నుంచి పిజి మొదటి సంవత్సరంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఎండోమెంట్ స్కాలర్‌షిప్ అందించడం శుభపరిణామన్నారు. ఈ కార్యక్రమంలో ఎపి పిజి సెట్ 2024 లో 1.కురువ అఖిల (ఎంఎస్సీ మ్యాథమెటిక్స్ - రెగ్యులర్ - 17,627/-, 2.బండారి దీప్తి (ఎంఎస్సీ అప్లైడ్ మ్యాథమెటిక్స్- 17,627/-), 3.కుమ్మరి లీలావతి (ఎంఎస్సీ కంప్యూటర్ సైన్స్ -17,627/-, విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ప్రదానం చేయబడ్డాయి. 2)మొదటి సంవత్సరం పరీక్ష టాపర్స్ - 2024 : 1.గిరిపోగు బేబీ హేమలత (ఎంఎస్సీ మ్యాథమెటిక్స్ రెగ్యులర్-8,814/-), 2.సాయి ప్రమిద (ఎంఎస్సీ మ్యాథమెటిక్స్ రెగ్యులర్-8,814/-), 3.తలారి సుమిత్ర (ఎంఎస్సీ అప్లైడ్మ్యాథ మెటిక్స్-17,627/-), 4.గోపిక (ఎంఎస్సీ కంప్యూటర్ సైన్స్17,627/-), అర్హులైన విద్యార్థులకు మొత్తం రూ.1,10,765/- స్కాలర్‌షిప్‌లుగా పంపిణీ చేయబడిది. ఈ కార్యక్రమంలో సిడిసి డీన్ ఆచార్య ఎన్. చంద్రాయుడు, కాలేజ్ ప్రిన్సిపాల్ ఆచార్య కె. నరసయ్య, ప్రిన్సిపాల్ ఆచార్య వి. పద్మావతి, ఆచార్య జయ సుబ్బారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమ్మర్ క్యాంప్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్, క్యాంపస్, మంగళం : తిరుపతి రామకృష్ణ మిషన్ వారిచే ఈనెల 28 నుంచి మే నెల 18వ తేదీ వరకు 'సంస్కార శిబిరం- 2025' అనే వేసవి తరగతులను నిర్వహిస్తున్నట్లు రామకృష్ణ మిషన్ ఆశ్రమం కార్యదర్శి స్వామి సుకృతానంద మహారాజ్ తెలిపారు. ఈ 'సంస్కార శిబిరం' 5 నుంచి 10వ తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి రోజు ఉదయం 8.15గంటల నుంచి 12.15గంటల వరకు తరగతులు ఉంటాయని, ప్రతి రోజూ అల్పాహారం అందజేయబడుతుందని, దీనికి గాను ఒకొక్కరికి రూ. 1,200/- గా నిర్ణయించినట్లు తెలిపారు. వివరాలకు 94931 07001 లేదా 63601 50945 నెంబర్ల ద్వారా తెలుసుకోవచ్చునని వివరించారు.తెలిపారు. వివరాలకు 98853 71500, 70135 91635 నెంబర్లను సంప్రదించాలన్నారు.

ఉగ్రవాదులను కఠినంగా శిక్షించండి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : జమ్ము కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులను పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు చంపడం హేయమైన చర్య అని శ్రీకాళహస్తి డివిజన్ జిఎంపి సభ్యులు అన్నారు. శనివారం జి.ఎం.పి సభ్యుల ఆధ్వర్యంలో స్థానిక పెండ్లిమండపం వద్ద కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉగ్రవాదాన్ని కూకటి వేళ్ళతో సమూలంగా నిర్మూలించాలని నినాదాలు చేశారు. అలాగే ప్రపంచ వ్యాప్తంగా సమాజానికి పెనుముప్పుగా మారిన తీవ్రవాదాన్ని సమూలంగా నాశనం చేయకపోతే మానవ మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. తీవ్రవాదాన్ని అంతమొందించడానికి ప్రతి ఒక్కోరూ సమిష్టిగా పోరాడాలన్నారు. జిఎంపి సభ్యులు ఏడుకొండలు, శివశంకర్, సురేష్ రెడ్డి, వెంకటేశ్వర్లు, బాలాజీ, వీరయ్య, రాంబాబు, జ్ఞానమ్మ, మాల్యాద్రి ,చంద్రశేఖర్, బాషా, ఏసీ మండల్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రూరల్ మండలం, ఉత్తరపు కండ్రిగకు చెందిన ఎన్.కాంతమ్మ, వేపగుంటకు చెందిన అరవ రాజా ముత్తు, పుత్తూరు మున్సిపాలిటీ గోవింద పాలెం గ్రామానికి చెందిన గుంటి మురళీ అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందారు. హాస్పిటల్ మెడికల్ బిల్లులకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సాయం చేయాలని నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ విజ్ఞప్తి చేయగా, ఎమ్మెల్యే వారికి చెక్కులు మంజూరు చేయించారు. ఎన్. కాంతమ్మ- రు. 1,90,840 /-, అరవ రాజముత్తు-రు. 55,900 /-, గుంటి మురళీ కృష్ణ-రు. 1,31,192/- చెక్కులు ఎమ్మెల్యే పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య, పట్టణ అధ్యక్షులు గాలి జీవరత్నం నాయుడు, పట్టణ ప్రధాన కార్యదర్శి ఎన్ ఎన్ ధనపాల్, మాజీ ఎంపీపీ టిడిపి నాయకులు డి ఎన్ ఎలుమలై అమ్ములు. మాజీ మున్సిపల్ చైర్మన్ బిసిఆర్ యుగంధర్. కౌన్సిలర్ కేశవ ఆచారి, మున్సిపల్ కమిషనర్ మంజునాథ గౌడ, నాయకులు పాల్గొన్నారు

పంచాయతీ కార్యదర్శి తేజేశ్వికి డాక్టరేట్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రూరల్ మండలం, పరమేశ్వర మంగళం, గ్రామ పంచాయతీ కార్యదర్శిగా సేవలందిస్తున్న జి. తేజేశ్వి, కుప్పంలోని ద్రావిడియన్ యూనివర్సిటీ నుండి డాక్టరేట్ పట్టా (పిహెచ్‌డి) పొందారు. కంప్యూటర్ సైన్స్ విభాగంలో "లోడ్ బ్యాలెన్సింగ్ ఇన్ క్లౌడ్ కంప్యూటింగ్ యూసింగ్ హైబ్రిడ్ అప్రోచ్" అనే అంశంపై విశేష పరిశోధనలు నిర్వహించి డాక్టరేట్ అందుకున్నారు. తన పరిశోధన ప్రయాణంలో ఆయన 15 అంతర్జాతీయ, జాతీయ జర్నల్స్‌లో వ్యాసాలు ప్రచురించగా, 34 సదస్సుల్లో పాల్గొన్నారు. ఆయన పంచాయతీ కార్యదర్శిగా ఉన్నప్పటికీ, విద్య పట్ల చూపిన నిబద్ధత అభినందనీయమని గ్రామస్తులు కొనియాడుతున్నారు.

వాస్తవాలను వక్రీకరించి ప్రచారం చేస్తున్నారు: కిషోర్ రెడ్డి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుచానూరు గ్రామపంచాయతీ పరిధిలో తమకు 40 సెంట్లు భూమి వంశపారపర్యంగా సంక్రమించిందని, కానీ దానిని మేము ఆక్రమణ చేస్తున్నామని వాస్తవాలను వక్రీకరించి పత్రికలలో వార్తలను ప్రాయించారని తిరుచానూరుకు చెందిన కిషోర్ రెడ్డి వాపోయారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తిరుపతికి చెందిన కృష్ణారెడ్డి కుమారుడు వెంకటరమణారెడ్డి, శేషారెడ్డి మరి కొంతమంది మాకు చెందిన స్థలంలో నిర్మాణాలు చేసుకోవడానికి అడ్డు తగులుతూ నియోజకవర్గ ఎమ్మెల్యే అండతో ఆక్రమణ చేస్తున్నానని దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. 1985లో మా స్వాధీన అనుభవంలో ఉన్న భూమి తిరుచానూరు గ్రామ లెక్కల దాఖల సర్వే నంబర్ 334/12లో 0.20, 333/3లో 0.20 సెంట్లు భూమికి ఉమ్మడి చిత్తూరు జిల్లా తాసిల్దార్ నుండి రైత్వారి పట్టాను పొందామన్నారు. ప్రజలు వాస్తవాలు గ్రహించాలన్నారు. ఈ కార్యక్రమంలో కిషోర్ రెడ్డి తండ్రి మణిరెడ్డి పాల్గొన్నారు.

సి.పి.ఎం ఆధ్వర్యంలో ఫండ్ క్యాంపెయిన్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ :గూడూరులో శనివారం సిపిఎం గూడూరు ప్రాంతీయ కార్యదర్శి జోగి శివకుమార్ ఆధ్వర్యంలో ఫండ్ క్యాంపెయిన్ కార్యక్రమంలో భాగంగా 25 మందిని కలవడం జరిగింది. రైతు బజార్, పట్టణం లో తిరిగి వసూలు చేసిన మొత్తం 10,500/- రూ.వసూలు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సి.పి.ఎం పార్టీ నాయకులు బి.వి.రమణయ్య, బి.చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

అభినయ్ డ్రామాలు ఆపండి: ఆర్ సి మునికృష్ణ

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ ఆర్‌సి ముని కృష్ణ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): కూటమి ప్రభుత్వం హామీలు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలన్నింటినీ విడతలవారీగా అమలు చేసి చూపిస్తామని నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ ఆర్ సి మునికృష్ణ స్పష్టం చేశారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో టిడిపి నాయకులుతో కలిసి ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కూడా పూర్తి కాకముందే మాజీ డిప్యూటీ మేయర్ భూమన అభినయ రెడ్డి నగరంలో డ్రామాలు వేస్తూ సూపర్ సిక్స్ పథకాల అమలు విచారిస్తున్నారని, ఆయన మొదటగా గత వైసీపీ ప్రభుత్వ హయంలో పూర్తిస్థాయిలో అభివృద్ధి జరిగే ఉంటే 64 వేల పైచిలుకు ఓట్లతో కూటమి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు ఎలా గెలిచారో ఆలోచించాలన్నారు. ఇకనైనా అభినయ రెడ్డి తన డ్రామాలు ఆపేయాలన్నారు. రాష్ట్ర నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీలకు బలమైన రక్షణ చట్టం తీసుకురావడానికి ప్రభుత్వం సబ్ కమిటీని నియమించిందన్నారు. ఈ విలేకరుల సమావేశంలో టిడిపి పట్టణ ప్రధాన కార్యదర్శి మహేష్ యాదవ్, సుబ్బు యాదవ్, శ్రీధర్, దేవరాజులు, సుధాకర్ రెడ్డి, రవిశంకర్ యాదవ్ పాల్గొన్నారు.

కాశ్మీర్ మారణకాండకు నిరసన

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : కాశ్మీర్లో ఉగ్రవాదుల దారుణ మారణకాండను నిరసిస్తూ ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ - యుటిఎఫ్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి ఉపాధ్యాయులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. స్థానిక మెయిన్ స్కూల్ నుండి కార్వేటినగరం రోడ్డు మీదుగా అంబేద్కర్ సర్కిల్ వరకు ఈ ర్యాలీ సాగింది. ర్యాలీలో ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ ర్యాలీలో పుత్తూరు ప్రాంతంలోని వివిధ మండలాల నాయకులు మునిరత్నం, నరేష్, లోకనాథం, శ్రీనివాసులు, విజయ నాగు, బాలాజీ, రమేష్, గిరిబాబు, మురళి, సురేష్, చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

అలిగి తిరుమలకు వచ్చిన మహిళ.. అప్పగింత

ప్రజాశక్తి - తిరుపతి డెస్క్: విశాఖపట్నానికి చెందిన రమ్యరాజు అనే మహిళ ఆర్థిక సమస